# Place Value Vs Face Value

## స్థాన విలువ – ముఖ విలువ

సంఖ్య లో ఒక అంకె ఉన్న స్థానాన్ని బట్టి దాని విలువ మారుతూ ఉంటుంది. దీనినే స్థాన విలువ (Place Value) అంటారు. కాని దాని ముఖ విలువ (Face Value) ఎప్పటికీ స్థిరంగానే ఉంటుంది. ఉదాహరణకి 39 లో 3 స్థాన విలువ 30, 9 స్థాన విలువ 9; అలాగే 93 లో 3 స్థాన విలువ 3 కాని 9 స్థాన విలువ 90. ఇది లెక్కల్లో చాలా ముఖ్యమైన కాన్సెప్ట్, అలాగే పిల్లలకి అర్థం అయ్యేలా చెప్పలేకపోతున్న కాన్సెప్ట్ కూడా (దురదృష్టం).

లెక్కల్లోనే కాదు నిజ జీవితంలో కూడా ఇది ముఖ్యమైనదే. మన తెలివితేటలు, చదువు, ఉద్యోగం, సంపాదన, హోదా వీటితో సంబంధం లేకుండా మన స్థాన విలువ మారుతూ ఉంటుంది.

**★ఉదాహరణకి:★** ఊళ్ళో సర్పంచ్ కి ఒక విలువ ఉంటుంది; అదే ఊళ్లోకి ఒక MLA వచ్చినప్పుడు సర్పంచ్ గారి కుర్చీ వెనక్కి వెళ్ళిపోతుంది. అదే మీటింగ్ కి మంత్రి గారు వచ్చినప్పుడు MLA గారి కుర్చీ కూడా కదులుతుంది. CM గారు ఉన్న మీటింగ్ లో ఎవరికీ కుర్చీ వేస్తారో కూడా తెలియదు.

అలాగే మన ఊరి స్టేషన్ లో SI గారే రాజు. కాని అదే స్టేషన్ కి CI గారు వస్తే, SI గారి కుర్చీ లో ఆయన కూర్చుంటారు. SI గారు నిలబడాలి. SP గారు వచ్చినప్పుడు CI గారి పరిస్థితి కూడా అంతే. కొన్ని మీటింగ్స్ లో IAS అధికారులకి కూడా కుర్చీ వేయని పరిస్థితి చూస్తూ ఉంటాం.

పదవి, అధికారం ద్వారా వచ్చే స్థాన విలువ ఆ పదవీ కాలం ముగియగానే పోతుంది. అలాగే మన కన్నా పై పదవి వ్యక్తి ప్రక్కన ఉన్నప్పుడు కూడా మన స్థాన విలువ మారుతుంది. ఈ విషయం తెలిసినా తమ పదవి, అధికారం శాశ్వతమని భావిస్తూ ప్రవర్తించే వాళ్ళని చూసి జాలి పడాలో, కోప్పడాలో తెలీదు. కొంతమంది ఒక స్థాయికి చేరుకున్న తరువాత తాము ఎక్కి వచ్చిన మెట్లు మర్చిపోయి, ఆ మెట్ల మీద ఉన్నప్పుడు చేసిన ఆలోచనలు, ఆశయాలు ఏమీ గుర్తుండవు. ఏరు దాటేసాం కదా, తెప్ప తగలబెట్టేస్తే ఇక నాకేంటి అనే ధోరణి.

**★Confidence Vs Overinflated Ego★** అనే విషయాల గురించి DIE EMPTY అనే బుక్ లో రాస్తూ, అహం అనేది మనిషిని ఎలా దహించివేస్తుందో చెబుతారు. మన రోజు వారీ విషయాల్లో చూస్తే, కొంత మంది డాక్టర్స్ తమ దగ్గరికి వచ్చిన పేషెంట్ గురించి అంతకు ముందు అతన్ని చూసిన మరొక డాక్టర్ తో మాట్లాడటానికి ఎంత అవసరం ఉన్నా, ఏ మాత్రం ఇష్టపడరు. నిజానికి దాని వల్ల వాళ్ళ సమయం

# Place Value Vs Face Value

## స్థాన విలువ – ముఖ విలువ

ఆదా అవుతుంది. పేషెంట్ సరిగ్గా చెప్పలేని విషయాలు అవతలి డాక్టర్ చెప్పగలడు కాబట్టి. కాని అలా చేస్తే తమ అహం దెబ్బ తింటుందని వారి నమ్మకం. ఇదే విషయం లాయర్స్ లో కూడా జరుగుతుంది.

మనిషి స్థాన విలువ మారుతూ ఉన్నా, ముఖ విలువ మాత్రం ఎప్పటికీ మారదు, మారకూడదు. మనిషికి ఉండాల్సిన ముఖ విలువ తగ్గకుండా/మారకుండా ఉండాలంటే తన ఆలోచనలు, నమ్మకాలు, విలువలు పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి. దీనినే స్వీయ అవగాహన అంటారు (Self Awareness). ఇదొక అతి ముఖ్యమైన **జీవన నైపుణ్యం (Life Skill).**

నా చదువు అక్షరాస్యత వద్దే ఆగిపోయిందా – లేక **విద్యావంతుడిగా** ఎదిగానా?
నేను విజ్ఞాన వంతుడనా – నాకు కాస్త **వివేకం** కూడా ఉందా?
నేను మేధావి వర్గానికి చెందిన వాడినే – కాని జనాభా లెక్కల్లో ఒకడిగా ఉన్నానా, లేక ఒక **మనిషిగా** సహానుభూతి, స్పందన తో జీవిస్తున్నానా?

ఈ రకమైన స్పృహ ఉంటే ఖచ్చితంగా మన ముఖ విలువ ఎప్పటికీ తగ్గకుండా ఉంటుంది, స్థాన విలువతో సంబంధం లేకుండా! అప్పుడు మనం ఆనందంగా ఉండటమే కాకుండా, మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కూడా అందంగా, ఆనందంగా ఉంచగలం!

మిత్రుడు తోట రాంబాబు అన్నట్టు కాంప్లికేటెడ్ ఫిలాసఫీ లు తెలిసుండటం కన్నా, మైండ్ బ్లాక్ అయ్యే లాజిక్కులు మాట్లాడటం కన్నా, నడిచే లైబ్రరీ అయిపోవడం కన్నా......హృదయంలో కాస్త తడి కలిగి ఉండటం, అవతలి వారి పట్ల స్పందించడం, ప్రేమగా మాట్లాడటం...అదే కదా **అత్యుత్తమ ఇంటెలిజెన్స్.**

**★ ఆలోచిద్దామా, స్థాన విలువ, ముఖ విలువ ఏది శాశ్వతమో ★**

*Surya Prasad*
*Padala Charitable Trust*
*padalasurya@yahoo.com*
*https://pct-india.org/*
*https://bit.ly/2Y6SMhN*